

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

అయినవిల్లిలో ఘనంగా ఉత్సవాలు
వార్త..7లో



జై..గణేషా..



అంబాజీపేట, గంగలకుర్రు మలుపు వద్ద ఆలయాన్ని అరటిగెలలతో అలంకరించిన భక్తులు



ఆలమూరులో వినాయక ఆలయం వద్ద 13 అడుగుల మట్టి వినాయకుడు



పి.గన్నవరం: చాకలిపాలెంలో ఊయలలో వినాయకుడు

రాయవరం: సోమేశ్వరంలో అయోధ్య రామమందిరం, కారు వాహనంలో వినాయకుడు.

రావులపాలెం మండలం ఉబలంకకు చెందిన తాపీ మేస్త్రీ చింతా కోదండరామా రెడ్డి వినూత్న రీతిలో కాంక్రీట్ మిల్లర్‌ను అలంకరించి దాని లో వినాయక ప్రతిమ పెట్టి ప్రత్యేక పూజలు చేశారు.



రావులపాలెం

'ఆయ్' సినిమాను వీక్షించిన దర్శకుడు అంజి

ఘన స్వాగతం పలికిన థియేటర్ యాజమాన్యం



అంజిని సత్కరిస్తున్న థియేటర్ యాజమాన్యం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 8: 'ఆయ్' సినిమా దర్శకుడు కె.అంజిమణిపుత్ర వినాయక చవితి సందర్భంగా అమలాపురంలో సందడి చేశారు. స్థానిక రమా థియేటర్‌లో ప్రదర్శిస్తున్న ఆయ్ సినిమాను తిలకించారు. తొలుత థియేటర్ ప్రాంగణంలో వినాయక చవితి వేడుకలను అంజిత్‌ప్రకాష్ దంపతులు నిర్వహించారు. ఇటీవల విడుదలై విజయం సాధించిన ఆయ్ చిత్ర దర్శకుడు అంజి అమలాపురానికి చెందిన వారే కావడంతో స్థానికులు, థియేటర్ యాజమాన్యం ఆయనకు ఘనస్వాగతం పలికింది. కార్యక్రమంలో మేనేజర్ కేతా వీరబాబు, ఏజెంట్ ముని, అక్కిన సురేంద్ర, నిమ్మకాయల సురేష్, కొప్పిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు. అంజి మాట్లాడుతూ రెండో సినిమా గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో ఉండవచ్చునని తెలిపారు. కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, రంకిరెడ్డి శ్రీనివాస్, నంద్యాల నాయుడు, ముత్యాల శరత్‌బాబు, కరాటం ప్రవీణ్ ఉన్నారు.

నేడు యథావిధిగా గ్రీవెన్స్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 8: కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి అర్జీలను స్వీకరిస్తారని ఫిర్యాదుదారులు సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని కోరారు.

తప్పిన పెను ప్రమాదం

రాజవొమ్మంగి మండలం బోర్నగూడెం శివారులో వంతెనపై నుంచి ఆర్టీసీ బస్సు బోల్తా

చెట్టు అడ్డు రావడంతో తప్పిన ప్రమాదం

7



పి.గన్నవరం శివారు జిల్లేడులంకలో మృతదేహాన్ని రేవు దాటిస్తున్న గ్రామస్థులు

అనారోగ్యంతో ఉన్న వారిని తరలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

అంతర్వేది: లంక ప్రాంతాలకు చేరిన వరద నీరు

స్తంభించిన జన జీవనం

● వర్షాలతో లంక గ్రామాల ప్రజల ఇబ్బందులు ●నీట మునిగిన పొలాలు ● మరో రెండు రోజులు ఇంతే...● ఆరెంజ్ అలర్ట్ జారీ

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఒకవైపు గోదావరి నదికి వరదలు.. మరోవైపు భారీ వర్షాలతో కోనసీమ జిల్లాలో ప్రజా జీవనం స్తంభించిపోయింది. గోదావరి నదులు ప్రవహిస్తుండడంతో నదీ పరివాహక లంక గ్రామాలకు రవాణా వ్యవస్థ స్తంభించిపోయి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని రోజుల నుంచి వరద ఉధృతి కొనసాగుతుండడంతో ఉపాధి కరువైన లంక గ్రామాల ప్రజలు తీవ్రమైన ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావం కారణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు వాతావరణశాఖ ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. దాంతో అధికార యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. ముఖ్యంగా శనివారం అర్ధరాత్రి నుంచి వర్షం ఓ మోస్తరుగా నిరంతరాయంగా కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన అమలాపురంతో పాటు రామచంద్రపురం, మండపేట, రావులపాలెం, కొత్తపేట వంటి ప్రాంతాలతో సహా వివిధ ప్రాంతాల్లో వర్తక వాణిజ్య వ్యాపార సంస్థలన్నీ మూతబడే ఉన్నాయి. వర్షం కావడంతో పనివారు రాకపోవడం వల్ల సంస్థలు తెరుచుకోలేదు. రానున్న రెండు, మూడు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేస్తుండడంతో ఆ పరిస్థితిని అధిగమించేందుకు రెవెన్యూ, పోలీసు, విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వర్షాల వల్ల రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. కొన్ని రోడ్లు బురదమయంగా మారి ప్రయాణానికి అసౌకర్యంగా ఉన్నాయి. ప్రధానమైన డ్రెయిన్లు, పంటకాల్వలు పొంగి ప్రవహిస్తుండడంతో సమీప ప్రాంతాల్లో ఉన్న పంట పొలాలు జలదిగ్బంధానికి గురవుతున్నాయి. గత కొన్ని రోజుల నుంచి వర్షాలు కురుస్తూనే ఉండడంతో ముంపు బారిన పడిన పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పటికే వరి పంటపై కొన్ని ప్రాంతాల్లో తెగుళ్లు సోకి రైతులకు నష్టం వాటిల్లుతోంది. ముంపునీరు దిగే మార్గం లేకపోవడంతో చేలన్నీ కుళ్లిపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రొయ్యల చెరువులకు సైతం వర్షాలు చేటు తెచ్చే పరిస్థితిపై ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిలకడగా గోదావరి

గోదావరి వరద ఆదివారానికి నిలకడగా కొనసాగుతోంది. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద వరద స్వల్పంగా తగ్గుతున్నప్పటికీ వివిధ జిల్లాల్లో కురుస్తున్న వర్షాల వల్ల నదీ ప్రవాహం నిలకడగానే కొనసాగుతుండడంతో నదీ పరివాహక లంక గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. కోనసీమలోని వివిధ కాజ్‌వేలు జలదిగ్బంధానికి గురయ్యాయి. పాశర్లపూడి, అప్పనపల్లి, కనకాయలంక, చాకలిపాలెం, ముక్తేశ్వరం తొగరపాయ, రామరాజులంక కాజ్‌వేతో సహా అనేక ప్రాంతాల్లో ఉన్న కాజ్‌వేలు జల దిగ్బంధంలో చిక్కుకోవడంతో ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. కొన్నిచోట్ల లంక గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. పి.గన్నవరం మండలంలోని వివిధ గ్రామాల నుంచి అనారోగ్యంతో ఉన్న వారిని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది పడవలపై తరలించి 108 ద్వారా సమీపంలోని ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించేందుకు పంపిస్తున్నారు. చివరకు లంకల్లో చనిపోయినవారి మృతదేహాలకు అంత్యక్రియలు చేయడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇక గత కొన్ని రోజుల నుంచి జీవనాధారం కొరవడడంతో ఇళ్లకే పరిమితమైన లంక గ్రామాల ప్రజలకు ఆర్థిక కష్టాలు తీవ్రమైన నేపథ్యంలో ప్రభుత్వం బాధితులకు సహాయం అందించాలని వేడుకుంటున్నారు. నిత్యావసర సరుకులను ఉచితంగా సరఫరా చేయాలని డిమాండు చేస్తున్నారు. తాగునీరు కలుషితం కావడం వల్ల ప్రత్యేకంగా లంక గ్రామాలకు తాగునీటిని అందించి దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు. ఒకవైపు వర్షాలు.. మరోవైపు వరదలు.. చలిగాలుల తీవ్రతతో మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా కోనసీమ జిల్లా ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. దీనికితోడు గణేష్ నవరాత్రులు కావడం వల్ల రేవుల్లోకి వెళ్లి విగ్రహాలు నిమజ్జనాలు చేసేవారు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గడిచిన 24 గంటల్లో వర్షపాతం వివరాలు


అమలాపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం అత్యధికంగా 15.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా అమలాపురంలో 2.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 7.2 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. ఆత్రేయపురం 8.4 మిల్లీమీటర్లు, మండపేట 12, రాయవరం 12, రామచంద్రపురం 6, ఆలమూరు 13.4, రావులపాలెం 13.2, కపిలేశ్వరపురం 11.2, కె.గంగవరం 8.8, ఐ.పోలవరం 4.6, ముమ్మిడివరం 8.2, అయినవిల్లి 7, పి.గన్నవరం 3.8, అంబాజీపేట 3.2, మామిడికుదురు 4.2, రాజోలు 6.2, మలికిపురం 3, సఖినేటిపల్లి 3.4, అల్లవరం 3.8, ఉప్పలగుప్తం 3.2, కాట్రేనికోన మండలంలో 4.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



స్వామివారి దర్శనానికి తరలివస్తున్న భక్తులు

ఓం నమో వేంకటేశాయ..

భక్తులతో కిటకిటలాడిన వాడపల్లి వెంకన్న ఆలయం




ఆత్రేయపురం, సెప్టెంబరు 8: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శని, ఆదివారాలలో భక్తజనం పోటెత్తారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ఏడువారాల నోమును భక్తిశ్రద్ధలతో ఆచరించి అష్టోత్తర పూజలు నిర్వహించుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.17.16 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. స్వామివారిని నర్సాపురం సినియర్ సివిల్‌జడ్జి జి.గంగరాజు దంపతులు, కొత్తపేట జూనియర్ సివిల్‌జడ్జి బి.జశ్వంతి యాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి
ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి
7లో

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొండేటి చిట్టిబాబు

కాంగ్రెస్ పార్టీ ఉత్తర్వులు



మామిడికుదురు, సెప్టెంబరు 8: అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును నియమించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు ఏఐసీసీ నుంచి వెలువడ్డాయి. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తానని ఈ సందర్భంగా చిట్టిబాబు తెలిపారు. రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ పటిష్టానికి కృషిచేస్తానని చిట్టిబాబు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన ఆయన్ను పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు.



చిరుతను పట్టుకునేందుకు బోను..

అమ్మో..చిరుతపులి

లాలాచెరువు--దివాన్‌చెరువు రిజర్వుడు ఫారెస్ట్ మధ్య సంచారం
టీవీ రిలేకేంద్రం సీసీ కెమెరాలకు చిక్కిన చిరుత
మూడు రోజులుగా భయంభయంగా జనం
ఎలా వచ్చిందో తెలియని వైనం
అధికారులకు అంతుపట్టని పరిస్థితి
ఆచూకీ కోసం 50 ట్రాప్ కెమెరాలు
నాలుగు బోన్లు ఏర్పాటు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం సిటీ ఆనుకుని ఉన్న రిజర్వు ఫారెస్ట్ ఏరియా పరిసర ప్రాంతాలలో చిరుతపులి సంచరిస్తోంది. సీసీ కెమెరాల పుటేజీలలో పులి కదలికలు స్పష్టంగా నమోదు అయ్యాయి. శుక్రవారం నుంచి ఈ ప్రాంతంలో చిరుతపులి సంచారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గతంలో రాజమహేంద్రవరం చిరుత పులులు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం ఒక ఇంట్లో బాత్‌రూమ్‌లో తలుపు తీయగా కనిపించిన సంగతి తెలిసిందే. కొంతకాలం క్రితం ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్‌లో ఒక జంతువుపై దాడిచేసింది. కానీ అప్పట్లో ఆచూకీ లభ్యం కాలేదు. జిల్లాలోని గోపాలపురం ఏరియాలో పెద్దపులి సంచారం తీవ్ర భయాందోళనకు గురి చేసిన సంగతి తెలిసిందే.. అంతకు ముందు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో అనేక రోజుల పాటు ప్రజలను ఇబ్బందులు పెట్టింది మరో పులి. ప్రస్తుతం రాజమహేంద్రవరం రిజర్వు ఫారెస్ట్ పరిసర ప్రాంతాలలో కనిపించిన చిరుత పులి ఇంతవరకూ పెంపుడు జంతువులపై దాడి చేసిన సంఘటనలు లేవు. కానీ సీసీ కెమెరాలో ఒక పంది వెనుక నడుస్తున్న దృశ్యాలు స్పష్టంగా ఉన్నాయి. అడుగు జాడలు గుర్తించారు. దీనితో ఇక్కడ చిరుతపులి సంచరిస్తున్నది నిజమేనని ఫారెస్ట్ అధికారులు ధ్రువీకరించారు.



చిరుతపులి కనిపించిన ప్రాంతం ఇదే..

ఎక్కడి నుంచి వచ్చింది?

ఈ చిరుతపులి ఎక్కడి నుంచి ఎలా వచ్చిందనేదానికి అధికారుల వద్ద కూడా సరైన సమాచారం లేదు. శుక్రవారం హౌసింగ్ బోర్డు ఆటోనగర్ మధ్య ఒక జంతువును నోట కరుచుకుని వెళుతున్న చిరుతపులిని ఒకరు చూసినట్టు ప్రచారం జరుగుతోంది. శుక్రవారం రాత్రి 11.25 గంటలకు లాలాచెరువు హౌసింగ్ బోర్డు ఎదురుగా, ఫారెస్టు అకాడమీ ఆఫీసులకు వెనుక భాగాన ఉన్న టీవీ రిలే కేంద్రం(ప్రసార భారతి) ప్రధాన గేటు వద్ద ఉన్న సీసీ కెమెరాలో ఒక పంది నడుచుకుంటూ పోతుండగా దాని వెనుక కొంతదూరం నడిచి, పక్కకు వెళ్లిన చిరుతపులి స్పష్టంగా కనిపించింది. దానికి కొంత దూరంలో ఉన్న హైవే నుంచి టీవీ రిలే కేంద్రానికి వచ్చే దారిలో పులి అడుగులు ముందుగా గుర్తించారు. ఫారెస్ట్ అకాడమీకి దగ్గరలో ఉన్న వేయింగ్‌మిషన్ వద్ద కూడా అడుగుజాడలు గుర్తించినట్టు అక్కడి వారు చెబుతున్నారు. వేయింగ్ మిషన్ వెనుక ఉన్నతోట నుంచి టీవీ రిలేకేంద్రం వైపు వెళ్లినట్టు అడుగుజాడలు కనిపిస్తున్నాయి. కానీ శనివారం రాత్రి 7గంటల సమీపంలో ఆటోనగర్ ప్రాంతంలో ఒక గోడ మీద నుంచి వెళుతున్నట్టు అక్కడివారు చెప్పినట్టు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ ఈ చిరుతపులి ఇక్కడకు ఎలా వచ్చింది. ఎక్కడి నుంచి వచ్చి ఉంటుందనేది అధికారులు కూడా స్పష్టం చేయలేకపోతున్నారు.

4 బోన్లు, 50 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు

చిరుతపులిని పట్టుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని కాకినాడ డీఎఫ్ఓ, రాజమండ్రి ఇన్‌చార్జి డీఎఫ్ఓ ఎస్.భరణి తెలిపారు. ఫారెస్ట్ అకాడమీలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. నాలుగుబోన్లు ఏర్పాటు చేశామని, 50 ట్రాప్ కెమెరాలు కూడా ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. పరిసర ప్రాంతాలలో మైక్ అనౌన్స్ మెంట్ చేశామని, కరపత్రాలు కూడా పంపిణీ చేశామన్నారు. ఈనెల 15వతేదీ వరకూ పుష్కరవనం మూసివేసినట్టు ఆమె తెలిపారు.



కెమెరా ఏర్పాటు



డొంకరాయి జలాశయం నుంచి నాలుగుగేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

డొంకరాయి జలాశయం నుంచి


నీరు విడుదల

- 4గేట్లు ఎత్తి 8800 క్యూసెక్కుల దిగువకు
- జలాశయంలో 1036.70అడుగుల నీటిమట్టం

మోతుగూడెం, సెప్టెంబరు 8: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయంనకు ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు నీరు వచ్చి చేరుతుండటంతో జలాశయం నుంచి 4గేట్లు ఎత్తి 8800 క్యూసెక్కుల నీటిని దిగువకు జెన్‌కో అధికారులు విడుదల చేస్తున్నారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులుగా కాగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి 12,500 క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లోస్ వచ్చిచేరుతుండటంతో జలాశయం నీటి మట్టం పూర్తిస్థాయికి (ప్రమాదస్థాయి)కి చేరుకోకుండా జెన్‌కో అధికార్లు ముందస్తు చర్యల్లో భాగంగా జలాశయం నుంచి నాలుగు గేట్లు ద్వారా 8800 క్యూసెక్కులు (ఒక్కొక్క గేటు నుంచి 2200క్యూసెక్కులు)నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి 3800 క్యూసెక్కుల నీటిని పవర్ కెనాల్ ద్వారా విడుదల చేస్తూ జలాశయంలో నీటి మట్టం పెరగకుండా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయంలో 1036.70అడుగుల నీటిమట్టం కొనసాగుతుంది. జలాశయానికి ఇన్ ఫ్లోస్ ఇంకా పెరిగితే వచ్చే ఇన్‌ఫ్లోస్‌ను బట్టి దిగువకు నీటిని విడుదల చేయడానికి జెన్‌కో సిబ్బందిని, అధికార్లను అప్రమత్తంగా ఉండాలని సీలేరు కాంపెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు ఆదేశాలు జారీచేశారు. డొంకరాయి ఏపీవీ డ్యాం నుంచి కూడా రెండు గేట్లు ద్వారా 1000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

సాధారణ స్థాయికి గోదావరి వరద

ధవళేశ్వరం, సెప్టెంబరు 8: ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాదహెచ్చరిక స్థాయి దాటి ప్రవహించిన గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతూ సాధారణ స్థాయికి చేరుకుంటోంది. శనివారం ఉదయం 8గంటలకు నీటిమట్టం 11.70 అడుగులకు తగ్గడంతో ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆపై తగ్గుతున్న నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 8.10అడుగులుగా నమోదుకాగా 5,08681 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం వద్ద తగ్గుతున్న నీటిమట్టం 26.90 అడుగులకు చేరుకుంది.



సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద నీరు

ఏలేరుకు వరద జోరు

- ఎగువ ప్రాంతం నుంచి భారీగా...
- ఆందోళన చెందుతున్న రైతులు

ఏలేశ్వరం, సెప్టెంబరు 8: ఏలేరు ప్రాజెక్టు నుంచి రెండోరోజు 5500 క్యూసెక్కుల నీటిని ఆదివారం విడుదల చేశారు. దీంతో ఆర్డీవో సీతారామారావు ఏలేరు జలాశయాన్ని సందర్శించి కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా ప్రాజెక్టులో నీటి నిల్వలు భారీగా పెరిగాయన్నారు. ఆర్డీవో సీతారామారావు మాట్లాడుతూ అల్పపీడనం కారణంగా మరో రెండు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉందని దీంతో ఎగువ ప్రాంతంలో కురిసే భారీ వర్షాలతో ప్రాజెక్టులో వరద నీరు చేరడంతో ఏలేశ్వరం, తుని, పిఠాపురం, గొల్లప్రోలు, కిర్లంపూడి, ప్రత్తిపాడు, సామర్లకోట, పెద్దాపురం మండలాల కు ప్రమాదం పొంచి ఉందని అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇప్పటికే పలు మండలాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు.



వరద నీటితో నిండిన ఏలేరు జలాశయం

ఏలేరుకు పెరిగిన వరద నీరు:

ఏలేరు ప్రాజెక్టులో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటి నిల్వలు పెరిగాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 11 గంటలకు ఏలేరులో నీటిమట్టం 85.34 మీటర్లకు చేరగా, నీటి నిల్వలు 21.65 టీఎంసీలకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఏలేరు రిజర్వాయర్‌లోకి అన్ని మార్గాల ద్వారా ఇన్‌ఫ్లోస్ 18,521 క్యూసెక్కు లు వస్తున్నాయి. దీనితో ఏలేరు కాలువలకు 6,900 క్యూసెక్కులు, డీసీఆర్ స్లూయిజ్‌కు 600 క్యూసెక్కులు వెరసి 7,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా విశాఖ అవసరాల నిమిత్తం 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మద్యం మత్తులో వీరంగం

కత్తితో దాడి చేయడంతో వ్యక్తి మృతి



మృతిచెందిన తుమ్మలపల్లి లక్ష్మణరావు

పెనుగుదురు(కరప), సెప్టెంబరు 8: కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురులో ఆదివారం మధ్యాహ్నం మద్యంమత్తులో ఉన్న ఒక నిందితుడు అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని కత్తితో విచక్షణారహితంగా పొడిచి చంపేశాడు. కరప పోలీసులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెనుగుదురు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వందే రాంబాబు స్థానిక సత్రం బస్‌స్టాండ్‌లో మిత్రులతో కలిసి మద్యం సేవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ తుమ్మలపల్లి లక్ష్మణరావు(58) కూడా అక్కడకు వచ్చి మిత్రులతో కలిసి మద్యం సేవించాడు. అప్పటికే పూటుగా మద్యం సేవించి పడిపోయిన కలవల శ్రీను అనే వ్యక్తిని ఇంటికి తీసుకెళ్లే విషయంలో వీరిద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని కొట్లాటకు దారితీసింది. సహచరులు విడదీయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయిన రాంబాబు కొద్దిసేపటి తరువాత మరలా సత్రం బస్‌స్టాండ్‌వద్దకు వచ్చి లక్ష్మణరావుతో ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో జేబులో ఉన్న కత్తి తీసి లక్ష్మణరావు కంఠం మీద, పొట్ట మీద పొడిచి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావంతో అపస్మారకస్థితిలోకి చేరిన లక్ష్మణరావును గ్రామస్తులు అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాకినాడరూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, కరప ఇన్‌చార్జ్ ఎస్ఐ ఆర్‌వీఎస్ మూర్తి, ఇంద్రపాలెం ఎస్ఐ వి.మణికుమార్‌లు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించి హత్యకు సంబంధించిన వివరాలను సేకరించారు. నిందితుడు వందే రాంబాబు ఈ ఏడాది జనవరి 18న నడకుదురు గ్రామానికి చెందిన మర్రి గిరీష్‌కుమార్ అనే వ్యక్తిపై ఇదే తరహాలో కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. నిందితుడు ప్రస్తుతం కండీషన్ బెయిల్‌పై బయట తిరుగుతున్నాడని పోలీసులు తెలిపారు. పట్టపగలు నడిరోడ్డుపై పాశవికంగా హత్యచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కుటుంబసభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు. మృతుడి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యకేసు నమోదుచేసినట్టు పోలీసులు తెలిపారు.

వీధి సినిమా వేస్తూ విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతిచెందిన మారుతి సుబ్బారావు

కొత్తపేట, సెప్టెంబరు 8: వినాయక ఉత్సవాలలో భాగంగా మోడేకుర్రులో వీధి సినిమా వేస్తూ విద్యుదాఘాతంతో ఒక వ్యక్తి మృతిచెందిన్నట్లు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం రాజోలు మండలం శివకోడుపాలెంనకు చెందిన శిరం మారుతి సుబ్బారావు (45) నవరాత్రి ఉత్సవాలకు, పండుగలకు తెరపై సినిమాలు వేస్తూ జీవనోపాధి సాగిస్తున్నాడు. వినాయక చవితిని పురస్కరించుకుని మోడేకుర్రు గ్రామంలో బాలగణపతి గుడివద్ద శనివారం రాత్రి వీధి సినిమా వేసే నిమిత్తం తెర కడుతుండగా ఆ గుడికి వేసిన లైటింగ్ వైర్లకు గుచ్చిన పిన్నీసు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. దీనిపై అతని భార్య నాగసరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల వద్ద విద్యుత్ వైర్లతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సురేంద్ర సూచించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన కంబాల లక్ష్మి

రావులపాలెం, ఆగస్టు 8: రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సు ఢీకొని ఒక మహిళ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా తిరుపతిపురానికి చెందిన కంబాల లక్ష్మి(58) ఆమె ఆత్రేయపురం మండలం వాడపల్లి కుమార్తె ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం తిరిగి స్వగ్రామానికి బయలుదేరింది. ఈ నేపథ్యంలో రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సు ఎక్కేందుకు ఇన్‌గేటు వద్ద కాకినాడ డిపోకు చెందిన బస్సు బలంగా ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు అల్లుడు చిట్టూరి జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంటి తెలిపారు.

ఆసుపత్రిపై దాడి కేసులో ఆరుగురి అరెస్టు

రావులపాలెం, సెప్టెంబరు 8: రావులపాలెంలో ప్రగతి నర్సింగ్ హోమ్ ఆసుపత్రిపై దాడికి పాల్పడిన ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ జేమ్స్‌రత్నప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రావులపాలెం మండలం రావులపాడు పరిధిలో ఉన్న ప్రగతి నర్సింగ్‌హోమ్, ఆసుపత్రి యజమాన్యం, సిబ్బందిపై కొందరు యువకులు దాడి చేశారు. దీనిపై ఆసుపత్రి సిబ్బంది, బుడ్డిగ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎస్పీ ఆదేశాలమేరకు డీఎస్పీ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టామన్నారు. ఆసుపత్రిలోని సీసీ పుటేజీల ఆధారంగా పి.గన్నవరం మండలం గంటిపెదపూడికి చెందిన చిటికెన బాలబాలజీ, కుప్పాల సూర్యనారాయణ, కుప్పాల జయబాబు, దంగేటి వెంకటరామదుర్గారావు, దిరిసల చరణ్‌తేజ, యర్రంశెట్టి సాయిహేమంత రాజ్‌కుమార్‌లుగా గుర్తించి అరెస్టుచేసి కొత్తపేట కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించిన్నట్లు సీఐ తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యువకుడి అనుమానాస్పద మృతిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ అప్పారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుబ్బా రావునగర్‌కి చెందిన కొండ్రు లోవరాజు(23) లారీ క్లీనరు/డ్రైవ రుగా పనిచేస్తున్నాడు. విజయవాడకు చెందిన యువతితో వివాహం కాగా ఏడాది కిందట మనస్పర్థల కారణంగా విడిపోయారు. ఆరునెలల నుంచి సుబ్బారావునగర్‌కి చెందిన ఓ వివాహితతో సహజీవనం చేస్తున్నాడు. ఆమె కొన్నాళ్ల కిందట భర్తతో విడిపోయింది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇద్దరికీ గొడవ జరిగింది. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం కావడంతో చర్చికి వెళ్లడానికి ఆమె ఉదయం ఇంటికి రాగా ఉరి వేసుకున్న స్థితిలో లోవరాజు ఉన్నాడు. వెంటనే స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. లోవరాజు మృతిపై తల్లి అనుమానం వ్యక్తం చేసింది. దీంతో మృతదేహంలో విస్రాను పరీక్షల నిమిత్తం డాక్టరు ల్యాబ్‌కి పంపామన్నారు.

రత్నగిరిపై వినాయకచవితి వేడుకలు



అన్నవరంలో వినాయకచవితి పూజలు చేస్తున్న దృశ్యం

అన్నవరం, సెప్టంబరు 8: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో వినాయకచవితి వేడుకలను శనివారం నిర్వహించారు. దర్బారు మండపంలో మట్టిగణపతిని ఏర్పాటుచేసి అ ర్చకస్వాములు పూజలు నిర్వహి ంచారు. ఈవో రామచంద్రమోహ న్‌దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

తప్పిన పెనుముప్పు!!

- అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం బోర్నగూడెం శివారులో అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు
- వంతెనపై నుంచి వాగులోకి పడబోయి చెట్టును ఆనుకుని ఆగిన బస్సు
- ప్రమాద సమయంలో బస్సులో 25మంది ప్రయాణికులు
- వీరిలో ఏడుగురికి తీవ్రగాయాలు.. మిగిలిన వారికి స్వల్ప గాయాలు
- ప్రయాణికులను ప్రాణాలకు తెగించి కాపాడిన స్థానిక టీడీపీ శ్రేణులు
- బ్రేకులు పడలేదన్న డ్రైవర్.. అతివేగమే కారణమంటున్న ప్రయాణికులు



సాహసోపేతంగా బస్సు లోపలికి వెళ్తున్న టీడీపీ కార్యకర్త



క్షతగాత్రులను బయటకు తీసి ఆస్పత్రికి తరలిస్తున్న టీడీపీ శ్రేణులు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 8: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి అనకాపల్లిజిల్లా నర్సీపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు కాకినాడ జిల్లా ఏలేశ్వరం మీదుగా వెళ్తోంది. ఈ బస్సు అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం సమీపంలోని చెరుకుంపాలెం పంచాయతీ బోర్నగూడెం గ్రామశివారులో కాలువపై ఉన్న బ్రిడ్జివద్ద అదుపుతప్పి కాలువలోకి దూసుకువెళ్లింది. పక్కనే ఒక చెట్టుకు బస్సు ఆనుకుని కిందకు వెలాడుతూ ఉండడంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. ఆ చెట్టు ఆపకపోయి ఉంటే పెనుప్రమాదం సంభవించేదని ప్రయాణికులు చెబుతున్నారు. బ్రేకులు ఫెయిలవడంతో కంట్రోల్ అవక పక్కకు పడిపోయినట్లు డ్రైవర్ చెబుతున్నాడు. ఉదయం 11.30గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం.

ప్రాణాలకు తెగించి కాపాడిన టీడీపీ శ్రేణులు

ప్రమాదం జరిగిన ప్రదేశం దట్టమైన అటవీ ప్రాంతం. ఇటువైపు సాధారణంగా జనసంచారం తక్కువగా ఉంటుంది. కానీ ప్రమాద ఘటన జరిగిన పది నిమిషాలకే అదృష్టవశాత్తూ అటుగా టీడీపీ రాజవొమ్మంగి మండల అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దంతులూరి శివరామచంద్రరాజు, అరకు మాజీ ఎమ్మెల్యే దొన్నుదొర, టీడీపీ కార్యకర్తలతో కలిసి ఓ కార్యక్రమం నిమిత్తం వెళ్తున్నారు. బస్సు పడిపోవడం గమనించి వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. టీడీపీ కార్యకర్తలు మరిశెట్ల శ్రీను, చెక్క లోవరాజు, అదేపల్లి శివ, పెద్దాడ నూకరాజు ప్రమాదకర పరిస్థితిల్లో కూడా బస్సులోకి వెళ్లి ప్రయాణికులను వెనుకపక్కన ఉన్న కిటకీల్లోంచి బయటకు తీశారు. బస్సునుంచి సురక్షితంగా క్షతగాత్రులను బయటకు తీసిన టీడీపీ శ్రేణులు ఆటోల్లో స్థానికంగా ఉన్న జడ్డంగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అందరికీ ప్రథమ చికిత్స చేశారు.

క్షతగాత్రులు వీరే...

ఈ ప్రమాద ఘటనలో అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం అనిగేరుకు చెందిన బెకేం మంగతాయారు(40), అల్లూరి జిల్లా రాజవొమ్మంగికి చెందిన పాములూరు రవి(28), కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గోనాడుకు చెందిన గుర్రాల కుమారి(45), అనకాపల్లి జిల్లా కేడీపేటకు చెందిన పెదపాటి వరలక్ష్మి(42), తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం ఎస్టీరాజాపురం చెందిన కురుముళ్ల మంగ(58), అల్లూరి జిల్లా రాజవొమ్మంగికి చెందిన సోమిరెడ్డి గౌరమ్మ(55)లకు తీవ్ర గాయాలు కాగా వారిని మెరుగైన వైద్యంకోసం రాజమహేంద్రవరం, ఏలేశ్వరం, నర్సీపట్నం ప్రభుత్వాస్పత్రులకు రిఫర్ చేశారు. మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటపడడంతో వారికి ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి పంపించారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు తెలిపారు. తహశీల్దార్ కరక సత్యనారాయణ జడ్డంగి ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. కాగా ఆర్టీసీ బస్సు అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రయాణికులు వాపోయారు. ప్రాణాలకు తెగించి బస్సులోకి ఎక్కి ప్రయాణికులను బయటకు తీసిన టీడీపీ కార్యకర్తలు మరిశెట్ల శ్రీను, చెక్క లోవరాజు, అదేపల్లి శివ, పెద్దాడ నూకరాజులను ప్రజలు, అధికారులు అభినందించారు.

రీజెన్సీ తరలింపులో

వాస్తవాలు తెలుసుకోవాలి

- పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి



యానాం, సెప్టెంబరు 8: యానాంలో ఉన్న రీజెన్సీ పరిశ్రమ యానాం నుంచి ఆంధ్రాకు తరలింపు విషయంలో ప్రజలందరూ వాస్తవాలు తెలుసుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రీజెన్సీ విషయంలో పుదుచ్చేరి సీఎం రంగసామి ఎంతో సహకరించారని, ఎన్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించడంలేదనడం అవాస్తవమన్నారు. యాజమాన్యం ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు పూర్తిస్థాయిలో రాయితీ కల్పించాలనడం సరైందికాదని, ఇప్పటికే యాజమాన్యానికి ప్రభుత్వపరంగా వాటిలో పలు రాయితీలు కల్పించారన్నారు. దీనిపై రీజెన్సీ యాజమాన్యంతో ఎప్పుడైనా చర్చకు తాను సిద్ధమన్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తానన్న నేపథ్యంలో యానాం నుంచి అద్దంకికి మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా యానాంపై ఎటువంటి అవగాహన లేని వ్యక్తిపై యాజమాన్యం ఆధారపడి ముందుకెళ్లి ఈపరిస్థితి తెచ్చుకుందన్నారు. యాజమాన్యం యానాంలో పరిశ్రమ తెరవాలని ఉద్దే శం ఉంటే తాను ప్రభుత్వంతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం ముందుకు రావాలని మల్లాడి అన్నారు.

సరైన సమాయంలో జవాబు చెబుతాను...

- రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు

రీజెన్సీ తరలింపుపై పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలపై రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు స్పందించారు. 1986నుంచి తాను యానాంలోనే ఉన్నా నని, ప్రజలతో ఒకరిగా వారి బాగోగులు చూడడంలో, వారిని కష్ట సమయంలో ఆదుకోవడంతో తన వంతు పాత్ర పోషించానన్నారు. ప్రజలకు తన నిజాయితీ తెలియాలంటే సరైన సమయంలో ప్రజలందరి సమక్షంలో నిర్ణయం చెబుతానన్నారు.

ఘనంగా శ్రీపాద వల్లభుని జయంతి

- ముగిసిన సప్తాహ మహోత్సవాలు





పుష్పాలు, మారేడుదళాలతో పూజ అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయ స్వామి, నృసింహ సరస్వతులను ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

పిఠాపురం, సెప్టెంబరు 8: శ్రీపాదవల్లభుని జన్మస్థానంగా దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన కాకినాడజిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో శ్రీపాదుని జయంతిని ఘ నం గా నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులను పుష్పాలు, మారేడు దళాలతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, పూలంగి సేవ, అభిషేకాలు జరిగాయి. మహాగణపతి పూజ, స్వామి దివ్యపాదపద్మములకు మహాన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, సర్వపుష్పపూజ, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్రనామార్చన, మంగళహారతి, వేదపారాయణ, రుత్విక్కులచే దత్తమూలమంత్ర అనుష్ఠానము, గురుచరిత్ర పారాయణ, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణం జరిగాయి. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, సాయంకాల అర్చన నిర్వహించారు. హోమానికి పూర్ణాహుతి జరిగింది. రాత్రి శ్రీపాదశ్రీవల్లభుల రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు మహాన్నప్రసాద వితరణ జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. వారంరోజులపాటు జరిగిన జయంతి ఉత్సవాలు ముగిశాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మధురపూడి నుంచి హైదరాబాద్‌కు పెద్ద విమానాలు

- త్వరలో నూతన టెర్మినల్ భవన నిర్మాణం
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

కోరుకొండ, సెప్టెంబరు 8: తూర్పుగోదావరిజిల్లా మధురపూడి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు 7 విమాన సర్వీసులు నడుస్తున్నాయని, ఆ సర్వీసుల్లో పెద్ద విమానాలను నడిపి మరింత మంది ప్రయాణికులు వెళ్లేటట్టు చేస్తామని కేంద్ర పౌర విమానయానశాఖా మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. మధురపూడి విమానాశ్రయంవద్ద ఆదివారం విమానాశ్రయం విస్తరణ, కొత్త టెర్మినల్ భవనంపై జరిగిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎయిర్‌పోర్టు విస్తరణ పనులు, నూతన టెర్మినల్ భవననిర్మాణ పనులపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్. జ్ఞానేశ్వరరావు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణలతో సమావేశమై కేంద్ర మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా రైతులు మధురపూడి విమానాశ్రయం చుట్టూ ఉన్న పొలాలకు వెళ్లేందుకు రోడ్డు వేయాలని గతంలో విమానాశ్రయం గోడ చుట్టూ సగం వరకు వేసిన రోడ్డును ఇంకో 2కిలో మీటర్ల మేర పొడిగించి బూరుగుపూడి మెయిన్‌రోడ్డుకు కలపాలని, ఎయిర్‌పోర్టులో పడుతున్న వర్షపునీరు మధురపూడి నల్లా చెరువులో కలుస్తుందని, ఆ చెరువు నిండాక బయటకు వెళ్లే దారి లేక వరి పొలాలను ముంచెత్తుతుందని, దీనిని కాలువల ద్వారా తొర్రిగడ్డ కాలువల్లో కలపాలన్నారు. అలాగే ఎయిర్‌పోర్టు వల్ల మధురపూడిలో సెల్‌టవర్ నిర్మించడం ఆపివేశారని, దాంతో గ్రామంలో సెల్ సిగ్నల్స్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సెల్‌టవర్ వేయడానికి అనుమతి ఇప్పించాలని మంత్రిని ఎమ్మెల్యే బత్తుల కోరారు. విమానాశ్రయం విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఆర్‌అండ్ ఆర్ ద్వారా లబ్ధి చేకూర్చాలన్నారు. ఎయిర్‌పోర్టు విస్తరణవల్ల సుమారు 1000 ఎకరాల్లో వ్యవసాయం ఆగిపోయిందని దానిమీద ఆధారపడిన రైతులు, రైతు కూలీలకు వారి అర్హతను బట్టి ఎయిర్‌పోర్టులో చిన్నచిన్న పనులు అప్పగించి ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం మంత్రి రామ్మోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న టెర్మినల్ భవనం 250 మందికి మాత్రమే సరిపడా ఉందని అయితే 1000 మంది ప్రయాణికులు వస్తున్న దృష్ట్యా నూతన టెర్మినల్ భవన నిర్మాణ పనులు చేపట్టి వచ్చే ఆగస్టుకు పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. దీనిపై కేంద్ర పౌర విమానయానశాఖ ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తోందన్నారు. అనంతరం ఆయన విమానాశ్రయ ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు మంత్రి రామ్మోహన్‌కు విమానాశ్రయంవద్ద ఎంపీ, ఎమ్మెల్యేలతోపాటు టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, టీడీపీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు తదితరులు స్వాగతం పలికారు.

విఘ్నాలు తొలగించే

సిద్ధి వినాయకుడు

- అయినవిల్లి విఘ్నేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకారంలో శ్రీసిద్ధివినాయకుడు, బారులు తీరిన భక్తులు

అయినవిల్లి, సెప్టెంబరు 8: కోరిన కోర్కెలు తీర్చే దైవం. విఘ్నాలు తొలగించే అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వేలాదిమంది భక్తులు పోటెత్తారు. వినాయక చవితి సందర్భంగా ఉదయం 3.45 నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల పండ్ల రసాలతో రుద్రాభిషేకం, లక్ష దూర్వార్చన, గణపతి కల్పం, శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. మూషిక వాహనంపై శ్రీస్వామివారికి మాడవీధి సేవ అనంతరం స్వామివారికి విశేష అలంకరణ జరిపారు. పంచ హారతులు ఇచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. క్యూలైన్లు, రహదారులు భక్తులతో కిక్కిరిశాయి. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ మర్యాదలతో సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు స్వాగతం పలికారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం చేశారు.

జోరువానలో భక్తుల జోరు..

వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం జోరువానలో అధికసంఖ్యలో భక్తులు అయినవిల్లి సిద్ధివినాయకుడిని దర్శించుకున్నారు. వినాయక చవితి రోజున 25వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 10వేల మంది భక్తులు అన్నప్రసాద ట్రస్టులో అన్నప్రసాదం స్వీకరించారు. ఉచిత దర్శనాలు కల్పించడం పట్ల భక్తులు హర్షం వక్తం చేశారు.

చెవిలో చెబితే కోర్కెలు తీర్చే లక్ష్మీగణపతి

- అంగరంగ వైభవంగా చవితి వేడుకలు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, సెప్టెంబరు 8: చెవిలో చెబితే కోర్కెలు నెరవేర్చే స్వామిగా పేరొ ందిన తూం ్పగోదావరి జిల్లా బిక్కవోలులో ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో చవితి ఉత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి 1-59కు తీర్థపుబిందె సేవతో స్వామివారికి ఉత్సవకమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి, కమిటీ సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి దంపతులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. శనివారం ఉదయం 10-29కు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు, కుమారుడు మనోజ్, కుమార్తె డాక్టర్ సనాతనిలతో కలసి కలశస్థాపనచేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తూర్పుచాళుక్యులు ఏర్పాటుచేసిన ఈ లక్ష్మీగణపతి ప్రాశస్త్యం దేశం అంతా తెలిసేలా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇందుకోసం ఇప్పటికే దేవదాయశాఖ రూ. 3కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా వుందని, దీనికి జతగా గ్రామస్తులు రూ.2కోట్లు సమకూరుస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం ద్వారా మరిన్ని నిధులు తీసుకువచ్చి బిక్కవోలు, గొల్లలమామిడాలోని ఆలయాలను అభివృద్ధి చేసి టెంపుల్ టూరిజంగా మారుస్తామని ఆయన వివరించారు. తాపేశ్వరం సురుచి ఫుడ్స్‌వారు స్వామికి 50కిలోల లడ్డూను బహూకరించారు. స్వామి వారిని దర్శించిన ప్రముఖుల్లో జనసేన నియోజవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, డీ అండ్ హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, కూటమి నేతలు పల్లి శ్రీనివాసరెడ్డి, రావాడ నాగు, ఇందల వీరబాబు, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఈవో ఆకెళ్ల బాస్కర్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామి దర్శనాలు కల్పించారు. అనపర్తి సీఐ శివగణేష్ ఆధ్వర్యంలో 25 మంది పోలీసులతో బిక్కవోలు ఎస్ఐ రవిచంద్రకుమార్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



మోరంపూడి ఫ్లయ్ ఓవర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి శ్రీనివాస్

ఫ్లైఓవర్లు అన్నీ పూర్తి చేస్తాం

- మోరంపూడి ఫ్లైఓవర్ ప్రారంభం
- మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం : మంత్రి దుర్గేష్


రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 8 : రహదారుల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం మోరంపూడి సెంటరులో జాతీయ రహదారిపై నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌ను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో నాటి ఎంపీ మురళీమోహన్ మోరంపూడి ఫ్లయ్ ఓవర్‌కు శిలాఫలకం వేశారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కారణంగా నేడు ఒక రూపుదాల్చింద న్నారు. ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి మాట్లాడుతూ ఏ దేశమైనా ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే అభివృద్ధి చెందుతుందన్నారు. సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ జాతీయ రహదారిపై ఉన్న దివాన్‌చెరువు, బొమ్మూరు, ఐటీసీ వేమగిరి వద్ద ఫ్లయ్ ఓవర్లు కూడా వేగవంతంగా చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ గతంలో మురళీమోహన్ ఎంపీగా ఉన్న సమయంలోనే వేమగిరి నుంచి దివాన్ చెరువు వరకు 5 ఫ్లైఓవర్లు మంజూరయ్యాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ ప్రక్రియ నిర్వీర్యం చేసిందన్నారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడు తూ కూటమి ప్రభుత్వంలో ఫ్లయ్ ఓవర్ నిర్మాణం వేగంగా పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరికి తెగుళ్ల బెడద

రావులపాలెం, సెప్టెంబరు8: ఖరీఫ్ నాట్లు వేసిన నాటి నుంచి వర్షాలు కురుస్తుండటంతో రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో ఖరీఫ్ నాట్లు సమయంలో కుండపోతగా వర్షాలు కురవడంతో నాట్లు దెబ్బతిన్నాయి. దీంతో సమయానికి వరిపైరుకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు చేపట్టలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎరువులు కూడా వేయలేదు. ఆకుముడత, మాగుడు, నల్లపెను, మొవ్వుపడటం, దుంపకుళ్లు తదితర తెగుళ్ల వరిపైరుపై దాడిచేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- గ్రామాల్లోని చవితి పందిళ్లల్లో గణనాథుల ప్రతిష్ఠ
- గణనాథులకు పిండి వంటలు నైవేద్యంగా సమర్పణ
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం







రాయవరం:వెదురుపాక సపాటా సెంటర్‌లో, యానాం:పిల్లారాయస్వామివారి ఆలయంలో, మండపేట: కొండపల్లివారివీధిలో, ద్రాక్షారామ: రామచంద్రపురం దబేదారునూతిసెంటర్‌లో, అల్లవరం మండలం బెండమూర్లంకలో గణనాథులు

అమలాపురంటౌన్, సెప్టెంబరు8: గణపతి నవరాత్రుల ను పురస్కరించుకుని అమలాపురం భూపయ్య అగ్రహారం లోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో లక్ష చామంతి పువ్వుల పూజ, లడ్డూల పూజ నిర్వహించారు. కేశవదాసు రాంబాబు-ఉమామహేశ్వరి, గంగాధర్-లావణ్య దంపతుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు లక్ష్మీగణపతిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పేరి కొండబాబు, పీవీఎస్ చలపతిరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక దుడ్డువారి అగ్రహారంలోని బాలవిద్యార్థి గణపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి వేడుకల్లో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆయనకు జయంతి శివ ఆశీర్వచనం అందజేశారు. అగ్రహారంలో వచ్చే ఏడాది నాటికి ఆలయం నిర్మించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఆజాద్‌నాగసుధాకొండ, మంగళంపల్లి అంజిబాబు ఆధ్వర్యంలో మంత్రి సుభాష్‌ను సత్కరించారు. అడబాల బుజ్జి, పోలిశెట్టి బాబి, జయంతి సురేష్, మంగళంపల్లి ప్రదీప్, గోపి రమేష్, అనుపోజు శ్రీనివాస్, కోరశిక సత్తిబాబు, జయంతి శ్రీకాంత్, అరిగెల తేజ పాల్గొన్నారు.

కొత్తపేట: మండలంలో వినాయకచవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మట్టి వినాయక ప్రతిమలను పత్రి, పండ్లు, పూలతో అలంకరించి కుడుములు, క్షీరాన్నం, పులిహోర నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో వినాయక చవితిని ఆచరించారు. ముఖ్యంగా సంత మార్కెట్ సిద్ధి వినాయకుడు ఆర్యవైశ్యుల వినాయకుడు, కళానగర్ వరసిద్ధి వినాయకుడు పాత రామాలయం, లక్ష్మీగణపతి వినాయకుల విగ్రహాలకు ఆయాకమిటీల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

కాట్రేనికోన: చెయ్యేరుఅగ్రహారం, పెనుమెల్ల, లక్ష్మీవాడ, బంటుమిల్లి, ఉప్పూడి, కాట్రేనికోన, నడవపల్లి, గెద్దనపల్లి, కొప్పిగుంట, దొంతికుర్రు, కందికుప్ప, పల్లం, పల్లంకుర్రు, బలుసుతిప్ప, కుండలేశ్వరం, చిర్రయానాం గ్రామాల్లో వినాయకచవితి వేడుకలు ప్రారంభమయ్యాయి.

ముమ్మిడివరం: గణపతి నవరాత్రి వేడుకలను మండలంలో ఘనంగా ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుని ఆలయాల వద్ద చలువపందిళ్లు వేసి వాటిని విద్యుద్దీపాలతో అలంకరించారు. శనివారం ఉత్సవ విగ్రహాలు నెలకొల్పి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాల వద్ద ప్రత్యేకంగా పూజలు జరిపించారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మార్కెట్ సెంటర్‌లోని శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద, బళ్లగేటు సెంటర్‌లోని త్రిముఖ గణపతి ఆలయం, పోలీసు స్టేషన్ వద్ద, రాయుడువారిపాలెం, క్రాపచింతలపూడి, అనాతవరం, సీహెచ్ గున్నేపల్లి, అయినాపురం, అన్నంపల్లి, కొత్తలంక, ఠాణేలంక తదితర గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. బళ్లగేటు సెంటలోని త్రిముఖ గణపతి ఆలయం వద్ద చిన్నారులు ప్రదర్శించిన భక్తిగీతాలు, కోలాటంఆకర్షించాయి. భక్తులు వినాయకచవితి పూజా, వ్రతాన్ని ఇళ్లల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వినాయకునికి ఇష్టమైన వంటకాలను నైవేద్యంగా సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అంబాజీపేట: అంబాజీపేట శివారు గంగలకుర్రు మలుపులో వేంచేసియున్న శ్రీయువగణపతి ఆలయాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 108అరటి గెలలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. మండలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాడవాడలా పందిళ్లు ఏర్పాటుచేసి గణపతి విగ్రహాలను ఏర్పాటుచేశారు. విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. యువకుల ఆధ్వర్యంలో ఆయా మందిరాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కె.గంగవరం: మండలంలో వినాయకచవితి వేడుకలు శనివారం ప్రజలు నిర్వహించారు. గ్రామాల్లోని పలు కూడళ్లలో వినాయకుని మండపాలు ఏర్పాటుచేసి వినాయక విగ్రహాల ఏర్పాటుచేసి పూజలు చేశారు. గణపతి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ప్రజలు ఇళ్ల వద్ద పాల విల్లులు ఏర్పాటు చేసి, పిండి వంటలు, వివిధ రకాలు పత్రిలు తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో గణపతికి పూజలు చేశారు.

పి.గన్నవరం: ప్రతి ఇంట గణనాథుడుకి విశేష పూజలు చేశారు. గ్రామ ప్రధాన కూడళ్లలో, గణపతి ఆలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గణపతి మండపాల్లో మట్టి వినాయకుని ప్రతిమలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల్లంక శివారు చాకలిపాలెంలో న్యాయవాది మోల్లేటి శ్రీనివాసరావు నివాస ఆవరణలో ప్రధాన రహదారి చెంతనే ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఉయ్యాల్లో బొజ్జగణపయ్యను ఏర్పాటుచేసి కుంటుంబ సభ్యులతో పూజలు నిర్వహించాడు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపం విశేషంగా ఆకట్టుకుంది. మండలంలోని వివిధ గ్రామాల్లో గణపతి ఆలయాల్లో స్వామివారికి పూజలు నిర్వహించారు. పి.గన్నవరం శివారు డి.ఎస్.పాలెంలో చిన్నారులు మట్టి గణనాధుడుని సైకిల్ ఏర్పాటుచేసి తీన్‌మార్ డప్పులు వాయిస్తూ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మట్టి గణనాధుడు వర్షానికి తడవకుండా గొడుగు ఏర్పాటు చేశారు.

మామిడికుదురు: వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలుచోట్ల వినాయకుని విగ్రహాలు ఏర్పాటుచేసి వ్రతాన్ని ఆచరించారు. మామిడికుదురులోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద తొమ్మిది రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ నిర్మాత వాసంశెట్టి సత్యనారాయణమూర్తి తెలిపారు. మామిడికుదురులోని రామాలయం వద్ద ఏర్పాటుచేసిన గణనాథుని విగ్రహం వద్ద ఈలి రాంబాబు దంపతులు కర్తలుగా వినాయక వ్రతాన్ని ఆచరించారు. పలుచోట్ల చలువ పందిళ్లు వేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

మలికిపురం: గణేష్ నవరాత్రులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. మలికిపురం, లక్కవరంలలో వినాయక ఆలయాలను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట గుండుబోగుల పెదకాపు, దిరిశాల బాలాజీ, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, జక్కంశెట్టి శ్రీదేవి, జంపన సత్యనారాయణరాజు తదితరులు ఉన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

కపిలేశ్వరపురం: మండలంలో వినాయకచవితిని భక్తులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. పండ్లు, కాయలతో పాలవెల్లులను ఏర్పాటు చేసి మండపంలో విఘ్నేశ్వరుని నెలకొల్పి పూలు, పత్రులు, పసుపు, కుంకుమ, అక్షింతలతో గణనాధునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. విద్యార్థులు చదువుల్లో రాణించాలంటూ ఆదిగణపతిని వేడుకున్నారు. పలు గ్రామాల్లోని ఆలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన పందిళ్లలో గణేష్ విగ్రహాలను నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మండపేట: వినాయక చవితి వేడుకలను శుక్రవారం వాడవాడలా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండపేటలోని అన్ని వార్డుల్లో యువత, నిర్వాహకులు వినాయక మండపాలను ఏర్పాటుచేసి ఉత్సవాలు నిర్వహించారు. పట్టణంలోని వేగుళ్ల వారి దొడ్డి వద్ద ఉన్న కొండపల్లి వారి వీధిలో వినాయకుడిని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పార్టీ శ్రేణులతో కలిసి దర్శించుకున్నారు. బూరుగుంట రామాలయం వద్ద ఉన్న వినాయకుడి ఆలయంలో వినాయకుడిని ఎమ్మెల్యే వేగుళ్ల దర్శించుకుని పూజలు చేశారు. మండపేట మున్సిపల్ ఛైర్మన్ పతివాడ నూకదుర్గారాణి పట్టణంలో పలు వార్డుల్లో వినాయకుడిని దర్శించుకున్నారు. మండలంలో గ్రామాగ్రామాన వినాయక చవితి వేడుకలు జరుపుకున్నారు. పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో విజయం సాధించడంతో పవన్ అభిమానులు 100కిలోల లడ్డూను కొండపల్లి వారి వీధిలోని వినాయకుడికి అందించి మొక్కు చెల్లించుకున్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం పట్టణం, మండలంలో శనివారం వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో దుండి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ బాహ్య ప్రాంగణంలో చవితి పందిరిలో గణపతి విగ్రహం ప్రతిష్ఠించి పూజలు జరిపారు. ద్రాక్షారామ మార్కెట్, నున్నవారివీధి, బియ్యంపేట, వెలంపాలెం కంబాల చెరువు, సంతమార్కెట్ సెంటర్ తదితర చోట్ల చవితి పందిళ్లలో గణపతి నవరాత్రి వేడుకలు నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల్లో చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో పలు కూడళ్లలో గణపతిని నిలిపి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలో దపేదారు నూతిసెంటర్, లారీయూనియన్ కార్యాలయం, వైఎస్ఆర్ నగర్, మేదర సంఘం తదితర ప్రాంతాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు.

రాయవరం: వాడవాడలా వినాయక చవితి వేడుకలు శనివారం నిర్వహించారు. సోమేశ్వరంలో అయోధ్య రామ మందిరం, బాల రాముడు, కారు వాహనంలో వినాయకుడుతో ఏర్పాటు చేసిన విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వెదురుపాక విజయదుర్గా పీఠంలో సామూహిక చవితి పూజలు చేశారు. పీఠాధిపతి గాడ్ భక్తులకు వినాయక చవితి కథను వివరించి అక్షింతలను అందజేశారు. వెదురుపాక సపటా సెంటర్‌లో లక్ష్మిగణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 12గ్రామాల్లో వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వినాయక మండపాలు ఏర్పాటుచేసి వినాయకుడు విగ్రహాలు ప్రతిష్ఠ చేసి పూజలు చేశారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో, వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ర్యాలి శక్తిగణపతి ఆలయం వద్ద సహస్ర కలశములు పూజచేసి 1000 మందికి పెన్నులను పంపిణీ చేశారు. స్వామివారికి కుడుములు నైవేద్యంగా సమర్పించారు.

ఆలమూరు: ఆలమూరు వినాయక ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 13 అడు గుల వరసిద్ధి వినాయక విగ్రహం విశేషంగా ఆకట్టుకుంటోంది. వేళంగికి చెందిన శిల్పి పదిహేను రోజులు శ్రమించి ఆలయం పక్కనే ఏర్పాటుచేసిన ట్రాక్టర్‌పై ఈమట్టి గణపయ్యను రూపొందించారు. భారీ విగ్రహం కావడంతో నిమజ్జనానికి తరలించేందుకు వీలుగా ట్రాక్టర్‌పై విగ్రహాన్ని ఏర్పా టు చేసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ నార్కెడిమిల్లి వెంకన్నబాబు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలు ఆలమూరు మండలంలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఇంటి వద్ద గణపతిని పూజించి నైవేద్యాలు సమర్పించారు. గ్రామాల్లోని కూడళ్లలో వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. పలు గ్రామాల్లో వినాయక పందిళ్ల వద్ద విద్యుత్ దీపాలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

రావులపాలెం: ఊబలంకకు చెందిన తాపీమేస్త్రీ చింతా కోదండరామారెడ్డి వినూత్న రీతిలో కాంక్రీట్ మిల్లర్‌ను అలంకరించి దానిలో వినాయక ప్రతిమ పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. వినాయక చవితి పూజలు అనంతరం ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. మిల్లర్‌ను ఆటో సహాయంతో తీసుకుని వెళ్లారు. మిల్లర్ గుండ్రంగా తిరుగుతుండటం అందులోని వినాయక విగ్రహం కూడా నాలుగు దిక్కులు తిరుగుతూ దర్శనమివ్వడంతో అందరూ ఆసక్తిగా తిలకించారు. వినాయకచవితి పర్వదినాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. రావులపాలెం మండలంలోని గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో, ముఖ్య కూడలిల వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అల్లవరం: బెండమూర్లంకలో గణనాథుడిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు దర్శించుకున్నారు. గోడిలో గణనాథుడిని మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

యానాం: యానాం నియోజకవర్గంలో వినాయక చవితి ఉత్సవాలు వాడవాడాలా ప్రారంభమయ్యాయి. స్థానిక పిల్లారాయవీధిలోని లక్ష్మీగణపతి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఉదయలక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు. యానాం నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాల్లో చవితి పందిళ్లు వేసి వినాయకుని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో గణపతి నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంకలో మండపాల్లో ఏర్పాటుచేసిన గణనాథులను దర్శించున్నారు. అంతర్వేది, అంతర్వేది దేవస్థానం, కేశవదాసుపాలెం, మోరి, మోరిపోడు, టేకిశెట్టిపాలెం, రామేశ్వరం, గొంది తదితర గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మండపాల వద్ద ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గుండుబోగుల పెదకాపు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, మార్గాని ఏడుకొండలు, పప్పుల ప్రసాద్, ముచ్చర్ల వెంకటేష్, గునిశెట్టి రాంజీ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయకచవితి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. రాజోలు పాత బస్టాండు, కనకదుర్గమ్మ గుడి వద్ద, మేకలపాలెం, పల్లిపాలెం, మట్టపర్తికాల్వగట్టు, ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట, ఆకులవారివీధిలో మండపాలు ఏర్పాటుచేసి భారీ గణనాథుల విగ్రహాలను కొలువుతీర్చారు. తాటిపాక, సోంపల్లి, శివకోటి, వేగివారిపాలెం తదితర గ్రామాల్లో పందిళ్లు వేసి వినాయక ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. సంప్రదాయబద్ధం వినాయకచవితి వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. గణపతి బొప్పా మోరియా అంటూ ఆలయాల వద్ద మార్మోగాయి.

రేపటి నుంచి ఉచిత కంటి పొర చికిత్సా శిబిరం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు8: చినకోరుమిల్లి గ్రామంలోని సీతారామ కాపుకల్యాణ మండపంలో మంగళవారం నుంచి ఈనెల16వరకు ఉచితకంటి పొర చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బులుసు కనకదుర్గ, వెంకటసత్యసుబ్రహ్మణ్య శర్మ జ్ఞాపకార్థం లంక విజయ, మెహర్‌చంద్, బులుసు, బమిడిపాటి కుటుంబ సభ్యుల నిర్వహణ సాగే శిబిరంలో చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ కంటి వైద్యాశాల నిపుణులు సేవలందిస్తారన్నారు. ఉదయం 10నుంచి ఒంటి గంట శిబిరం నిర్వహిస్తారు. సేవలు పొందగోరువారు 8997384164, 7095175251, 8008106566 నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

రజకుల చెరువులో చేపలు మృతి

రావులపాలెం, సెప్టెంబరు 8: రావులపాడు పంచాయతీ పరిధిలో ఉన్న రజకుల చెరువులో చేపలు మృతిచెందడంతో నష్టపోయామంటూ రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీకి చెందిన రెండు చెరువుల్లో ఒక దానిని రజకులకు కేటాయించారు. ఆ చెరువులో చేపలను వేసి పెంచుతున్నారు. అయితే శనివారం చెరువు వద్దకు వెళ్లి చూడగా చేపలు చనిపోయి పైకి తెలిపోయి ఉన్నాయని వాటి విలువ సుమారు రూ.2లక్షలకు పైగా ఉంటుందని నిర్వాహకుడు జిత్తుగపాడు రామకృష్ణ తెలిపారు. దీంతో రామకృష్ణ సంఘ పెద్దలైన పాలెపు రమణయ్య, చాగంటి సత్యనారాయణ, కోటిచుక్కల శ్రీనివాసరావులు సర్పంచ్ మట్టా సత్యాదేవిబాబ్జీ, కార్యదర్శి పట్టాభిరామయ్యలకు ఫిర్యాదు చేశారు.

డీఏటీ డీడీగా ఉషారాణి

యానాం, సెప్టెంబరు 8: యానాం అకౌంట్స్ అండ్ ట్రెజరీ శాఖలో జేఏవోగా విధులు నిర్వహిస్తున్న వినకోటి ఉషారాణికి డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ పుదుచ్చేరి ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆమె పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పరిపాలనాధికారి మునిస్వామిలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఉషారాణిని వారు సత్కరించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉషారాణిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

ఘనంగా స్వాతి నక్షత్ర పూజలు

అంతర్వేది, సెప్టెంబరు 8: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి స్వాతి జన్మ నక్షత్ర పూజలు ఘనంగా జరిగాయి. తొలుత అర్చకులు కలశను శిరస్సుపై ధరించి ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అష్టోత్తర కలశాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు సీతానగరం మండలం చినకొండెపూడికి చెందిన నండూరి వెంకట గంగారాజశేఖర్ రూ.లక్ష విరాళంగా అందించారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. అన్నదానం స్వామి, సత్యకిరణ్, విజయ్, గణేష్, సత్తిబాబు పాల్గొన్నారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదివారం విచ్చేశారు. ఆమెకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం చేశారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం జేసీకి సూపరింటెండెంట్ పి.విజయసారథి అందించారు. డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, ఆర్ఐ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

నీట్ ప్రవేశ పరీక్షలో తరణికి 2,127 ర్యాంకు



అమలాపురం టౌన్, సెప్టెంబరు 8: నీట్ పీజీ ఆలిండియా ప్రవేశ పరీక్షలో అమలాపురం పట్టణానికి చెందిన డాక్టర్ బేతిరెడ్డి తరణి 2,127 ర్యాంకు సాధించింది. యూటీఎఫ్ జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్-మీనా కుమార్తె తరణి జాతీయస్థాయిలో ర్యాంకు సాధించడంతో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు ఆధ్వర్యంలో ఆదివారం పలువురు అభినందించారు. జిల్లా సభ్యులు జీవీ రమణ, వై.మురళీమోహన్, వైవీఎస్ఎన్ బాలాజీ, కారెం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

రావులపాలెం, సెప్టెంబరు 8: మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో రహదారులు ఛిద్రమయ్యాయి. మురుగు డ్రైయిన్లు పొంగి ప్రవహించడంతో పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

అల్లవరం: వైనతేయ గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. బోడసకుర్రు పల్లిపాలెంలో 30ఇళ్లకు వరద నీరు చేరి తిరిగి తగ్గుముఖం పట్టింది. వరద నీరు వేగంగా సముద్రంలోకి దిగుతోంది. తహశీల్దారు వీవీఎల్ నరసింహం, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ ఎన్వీవీ సత్యనారాయణ బోడసకుర్రులో వరదపరిస్థితిని పరిశీలించారు.

అంబాజీపేట: మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి వర్షం కురుస్తుంది. పలు కాలనీలు జలదిగ్బంధంలో ఉన్నాయి. వరి చేలల్లో ముంపునీరు చేరడంతో నీటిని బయటకు మళ్లించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు వర్షం నీటితో నిండిపోయి చెరువులను దర్శనమిస్తున్నాయి. వీడని వర్షంతో ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు.

అంతర్వేది: అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం, లాకేపేట, సఖినేటిపల్లి లంక ప్రాంతాలకు వరద నీరు పోటెత్తింది. రెండు రోజులుగా తగ్గుతూ పెరుగుతూ వరదనీరు గ్రామాల్లోకి రావడంతో గ్రామస్తులు ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు భయాందోళనలకు గురవుతున్నారు. అప్పనరామునిలంక బాడిరేవు వంతెన వరదనీటిలో మునిగిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పడవలపై కొంతమంది ప్రయాణం చేసినా మరికొంత మంది రామరాజులంక మీదుగా ప్రయాణాలు సాగిస్తున్నారు. వరద నీరు పెరగడంతో సఖినేటిపల్లి రేవు రాకపోకలు నిలిచిపోయాయి.

14 పంచాయతీలకు రూ.లక్ష చొప్పున విరాళాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 8: జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ రాష్ట్రంలో 400 పంచాయతీలకు ఒక్కొక్క పంచాయతీకి రూ.లక్ష వంతున నిధులు విడుదల చేసినట్టు పార్టీ ముమ్మిడివరం మండలాధ్యక్షుడు దూడల స్వామినాయుడు తెలిపారు. ఐ.పోలవరం మండలంలో 14గ్రామ పంచాయతీలకు విడుదలేసిన మొత్తం జాబితాను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు ఆదివారం అందజేశారు. ఈనిధులకు సంబంధించి సోమవారం ముమ్మిడివరంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకుడు గోదశి పుండరీష్, మండల అధ్యక్షుడు మద్దింశెట్టి పురుషోత్తం, లంకలపల్లి జమ్మి సమక్షంలో విడుదల చేస్తామన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి సాయం

పి.గన్నవరం, సెప్టెంబరు8: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న లంకలగన్నవరానికి చెందిన కొల్లు రవీంద్రకు అదే గ్రామానికి చెందిన కొప్పాడి హేమంత్ రూ.34,700 అందించాడు. అండమాన్‌లో ఉంటున్న హేమంత్ స్నేహితుల ద్వారా రవీంద్రకు నగదు పంపించాడు. కొత్తపేట మండలం గంటిపెదపూడిలంక... లేనికి చెందిన అగ్నికులక్షత్రియ సంఘం సభ్యులు రూ.5వేలు అందించారు.

విశ్వజన కళామండలి 46వ వార్షికోత్సవం

ముమ్మిడివరం, సెప్టెంబరు 8: విశ్వజన కళామండలి 46వ వార్షికోత్సవాన్ని శనివారం ముమ్మిడివరంలో ఘనంగా జరుపుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో విశ్వజనకళామండలి జిల్లా అధ్యక్షుడు గెడ్డం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో విశ్వజన కళామండలి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మెండి కమల, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యడ్ల సురేష్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు మాస్టర్జీ విశ్వజన కళామండలి ద్వారా జాతీయస్థాయిలో 40ఏళ్లుగా ఎనలేని సేవలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామాచేసి 40 ఏళ్లుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై, బౌద్ధిజంపైనా ఎన్నో పాటలు రచించారన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. విశ్వజన కళామండలి జాతీయ అధ్యక్షుడు మాస్టర్జీ 73వ జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్‌చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర కమిటీ సభ్యుడు మేకల మీరాసా హెబ్, పల్లి సుశీల, కుసుమ వీరేష్, జి.స్వాతి, గొల్లపల్లి గోపి, గంటి సత్యనారాయణ, యలమంచిలి బాలరాజు, కేఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.


వరద బాధితులకు సాయం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 8: జనసేన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గ పరిధిలోని కనిగిరిలంక గ్రామంలో వరద బాధితులకు సాయం అందించారు. ఆయా ప్రాంతాల్లోని వరద బాధితులకు బ్రెడ్లు, బిస్కెట్లు, రస్కులు, చీరలు, దుప్పట్లు, లుంగీలు, టవళ్లను ఇంటింటికీ తిరిగి అందించారు. పశుగ్రాసం కొరతతో పాడి రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఎండుగడ్డిని రైతుల వారీగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకుడు లింగోలు పండు, యేడిద శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 8: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, ఆకుల ఏడుకొండలు, ఆకుల నాగేశ్వరరావు, సలాది గోవిందు, ఆశెట్టి శ్రీను, గంగాబత్తుల బుజ్జి, కొండ తదితరులు పాల్గొన్నారు. ఈఏడాది దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



అమలాపురం టౌన్, సెప్టెంబరు 8: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అమలాపురం పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు కొత్తూరి శ్రీనివాస్‌ను నియమించారు. ఈమేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు విడుదల చేశారు. విద్యార్థి దశ నుంచి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో పలు పదవులు నిర్వహించారు. శ్రీనివాస్‌ను సీనియర్ నాయకులు అయితాబత్తుల సుభాషిణి, కుమార్‌సింగ్, యార్లగడ్డ రవీంద్ర, కుడుపూడి శ్రీనివాస్ అభినందించారు.

సత్రంతోటలో ముంపు సమస్యను పరిష్కరించండి



ముంపు నీటిలో ఆందోళన చేస్తున్న సత్రంతోట మహిళలు

మామిడికుదురు, సెప్టెంబరు8: పాశర్లపూడిలోని సత్రం తోటలో వర్షాలతో ఏర్పడుతున్న ముంపు సమస్యను పరిష్కరించాలంటూ స్థానిక మహిళలు ఆదివారం ఆందోళన చేశారు. ప్రధానంగా ముంపునీరు దిగేలా డ్రైనేజీని ఏర్పాటుచేసి సమస్య పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు. సత్రం తోటను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆదేశాలతో తహశీల్దార్ ఆదివారం పర్యటించారు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వరద బాధితులకు రూ.2లక్షల సాయం

మలికిపురం, సెప్టెంబరు 8: మలికిపురం మదర్‌థెరిస్సా నర్సింగ్ కళాశాల విద్యార్థులు, కళాశాల మేనేజ్‌మెంట్ విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.2లక్షల చెక్కును రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు అందజేశారు. కాకి లక్ష్మణ్, మదర్‌థెరిస్సా నర్సింగ్‌కళాశాల కరస్పాండెంట్ కడలి గిరిప్రసాద్, గుండుమోగుల పెద్దకాపు, గుబ్బల ఫణి, రమ్య, కల్పన పాల్గొన్నారు.

డాక్టర్లపై దాడి అమానుషం

కొత్తపేట, సెప్టెంబరు 8: రావులపాలెం ప్రగతి నర్సింగ్ హోమ్ వైద్యులు, సిబ్బందిపై దాడి చేయడం అమానుషమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుడిపై దాడిచేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కొత్తపేట నియోజకవర్గ మెడికల్ అసోసియేసన్ ఆధ్వర్యంలో వైద్యులు ఎమ్మెల్యే సత్యానందరావుకు వినతిపత్రాన్ని అందించారు. బాధితులకు అండగా ఉంటామని సత్యానందరావు హామీ ఇచ్చారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం మాట్లాడుతూ వైద్యులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించండి

రావులపాలెం, సెప్టెంబరు 8: రావులపాలెం ప్రగతి నర్సింగ్‌హోమ్‌పై జరిగిన దాడిలో ఐఎంఏ వైద్యులు గోపాలపురంలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఐఎంఏ కొత్తపేట శాఖ అధ్యక్షుడు డాక్టర్ శేషుబాబు, సెక్రటరీ వీరెడ్డి, మండలంలోని వైద్యులతో కలిసి జగ్గిరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వైద్యం చేస్తున్న సమయంలో డాక్టర్‌పైనా, ఆసుపత్రిపైనా దాడి చేయడం అమానుషమన్నారు. వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా అన్నారు. అనంతరం జగ్గిరెడ్డి మాట్లాడుతూ దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించే విధంగా అధికారులతో మాట్లాడటంతో పాటు వైద్యులకు రక్షణ కల్పించాలని కోరతామన్నారు.

నవ్వుతూ.. నవ్విస్తూ.. ఉండే సినిమాలు తీస్తా

మామిడికుదురు, సెప్టెంబరు 8: నవ్వుతూ.. నవ్విస్తూ ఉండే సినిమాలు తీస్తానని ఆయ్ చిత్ర దర్శకుడు కంచిపల్లి అంజిబాబు తెలిపారు. అమలాపురానికి చెందిన ఆయన పాశర్లపూడిలంకకు చెందిన అల్లుడు కావడంతో వినాయకచవితి వేడుకలకు అత్తవారింటికి వచ్చారు. ఆయనను స్థానికులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. తమ గ్రామానికి చెందిన అల్లుడు చిత్రపరిశ్రమలో రాణించడం ఆనందకరమన్నారు. ఆహ్లాదాన్ని అందించే చిత్రాలు తీయడం తన కోరిక అని, స్నేహానికి విలువిస్తూ అభిమానులను ఆకట్టుకునే చిత్రాలను తీసి ప్రేక్షకులకు మరింత చేరువయ్యేవిధంగా పనిచేస్తానన్నారు. మొదటి చిత్రం ఆయ్ విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక పెద్దలు, అభిమానులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వివాహిత మృతి

ఆత్రేయపురం, సెప్టెంబరు 8: భర్త వేధింపులు తాళలేక వివాహిత మహిళ పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వద్దిపర్రు గ్రామానికి చెందిన మానేపల్లి గోవింద్‌కు ఉప్పలగుప్తం మండలం చల్లిపల్లికి చెందిన వెంకటలక్ష్మి(43)తో 20ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త గోవింద్ రోజూ మద్యం సేవించి భార్యను హింసిస్తున్నాడు. జీవితంపై విరక్తిచెందిన వెంకటలక్ష్మి శనివారం సాయంత్రం ఇంటి వద్ద పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కోడి పందాల శిబిరంపై దాడి

ఐ.పోలవరం,సెప్టెంబరు8: టి.కొత్తపల్లి పంచాయతీ దుప్పిలంకలో ఆదివారం పోలీసులు కోడిపందాల శిబిరంపై దాడి చేశారు. 8మందిని అరెస్టుచేసి రూ.9వేలు, 3పుంజులు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ భానుప్రసాద్ తెలిపారు.

కందికుప్పగరువుపేటలో శిబిరంపై దాడి

కాట్రేనికోన, సెప్టెంబరు8: పోలీసులు ఆదివారం కందికుప్ప గరువుపేటలో కోడిపందాల శిబిరంపై దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఒక పుంజు, ఒక కత్తి, రూ.1,200స్వాధీనం చేసుకున్నారు. గెద్దనపల్లి పోరపేటలో నలుగురిని అదుపులోకి తీసుకుని, 2పుంజులు, 2కత్తులు, రూ.1,600స్వాధీనం చేసుకున్నారు. చెంచులగరువులో చేసినదాడిలో నలుగురిని అరెస్టుచేసి, ఒక పుంజు, ఒకకత్తి, రూ.1,500స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

మద్యం స్వాధీనం

ఐ.పోలవరం, సెప్టెంబరు 8: గోగుల్లంకలో మద్యం విక్రయిస్తున్న ఇసుకపట్ల అర్జున్‌ను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. 162 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ భానుప్రసాద్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో షబ్బేదారి

మామిడికుదురు, సెప్టెంబరు 8: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా షబ్బేదారి (భక్తి జాగరణరాత్రి) భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నగరంలోని మంజిలే కర్బలాలో జరిగిన కార్యక్రమంలో మత ప్రబోధకుడు న్యామ్‌దార్ అబ్బాస్ పాల్గొని మజ్లిస్ ఆలపించారు. కార్యక్రమానికి మత ప్రబోధకుడు సయ్యద్ అబ్బాస్‌బాకరి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మాతం నిర్వహిస్తూ హుస్సేన్, అతని పరివారానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమం అంజుమానే ఘాజిఅబ్బాస్ ఆధ్వర్యంలో జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు పలు భక్త బృందాలు ఆహార పానీయాలు అందించారు.

డీఎస్పీ పర్యటన

కాట్రేనికోన, సెప్టెంబరు 8: అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆదివారం కుండలేశ్వరం పుష్కరాలరేవు, తనేలు, నడవపల్లి పల్లిపాలెం, పల్లంకుర్రురేవు, బూలవారిమొండి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు.

దుర్గాభవానికి ఆర్థిక సాయం

అంతర్వేది, సెప్టెంబరు 8: గొంది గ్రామంలో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో బాలిక బర్రే దుర్గాభవానీ తీవ్రంగా గాయపడింది. అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో వైద్యం చేసి ఒక చేయి తొలగించారు. రెండో చేయి కూడా తొలగించాలని వైద్యులు తెలిపినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు సమకూర్చిన రూ.20వేలను వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు ఆదివారం అందజేశారు. వసుధ ఫౌండేషన్ ప్రతినిధులు బోనం రాజు, అల్లూరి మధురామరాజు, సర్పంచ్ దొండపాటి రవికుమార్, హెచ్ఎం నరసహరశెట్టి సత్యనారాయణ, రావూరి నాగు పాల్గొన్నారు.

కృష్ణకు జాతీయ స్థాయి పోటీల్లో వెండి పతకం

ఆత్రేయపురం, సెప్టెంబరు 8: కోల్‌కతాలో జరిగిన జాతీయ విలు విద్య అండర్-19 పోటీల్లో అంకంపాలేనికి చెందిన కుదవ కార్తీకేయ కృష్ణ పాల్గొని రెండో స్థానంలో నిలిచినట్లు రాజమహేంద్రవరం ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ నిర్వాహకులు తెలిపారు. పలువురు కార్తీకేయ కృష్ణను అభినందించారు.

అయినవిల్లికి కాలినడకన

అమలాపురం టౌన్, సెప్టెంబరు 8: అమలాపురం పట్టణానికి చెందిన 18మంది భక్తుల బృందం గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కాలినడకన అయినవిల్లి బయలుదేరారు. చాగంటిప్రసాద్ ఆధ్వర్యంలో భక్తుల బృందం అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయం వద్దకు చేరుకోగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. భక్తులకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం భక్తబృందం అన్నదాన సేవలో పాల్గొన్నారు. శ్యామ్‌సింగ్, వాసు, నాగేశ్వరరావు, ఉమ, భవానీ, సుజాత, ధనలక్ష్మి, సిరి ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి రూ.87వేలు సాయం

ఆత్రేయపురం, సెప్టెంబరు 8 ర్యాలి రామకృష్ణ జడ్పీ హైస్కూల్‌లో 1994-95 టెన్త్ క్లాస్ మిత్ర బృందం మిత్రుడు కుటుంబానికి సాయం అందించారు. పూర్వ విద్యార్థి పాలంగి శ్రీను అనారోగ్యంతో మృతి చెందడంతో వారంతా కలిసి రూ.87వేలు ఆర్థిక సాయాన్ని శ్రీను కుటుంబ సభ్యులకు బ్యాంకులో జమ చేశారు.

మెగా జాబ్‌మేళా వాయిదా

అమలాపురం టౌన్, సెప్టెంబరు 8: జిల్లా ఉపాధి కార్యాలయం, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల10న అమలాపురం మిరియం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల10న జరిగే మెగా జాబ్ మేళాను వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోకమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా వాయిదా వేశామని, తదుపరి ఎప్పుడు జాబ్‌మేళా నిర్వహించేది త్వరలోనే వెల్లడిస్తామని, మరింత సమాచారం కోసం సెల్ 8247645389ను సంప్రదించాలన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్ర్కీన్-1	: 35 చిన్న కథకాదు
శేఖర్ స్ర్కీన్-2	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
రమా	: ఆయ్
గణపతి	: తంగలాన్
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: ఉరుకు పటేలా